

మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## అరోర్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

జిన్నారం, నవంబర్ 28: ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని అరోర్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 4.30 ప్రాంతంలో రియాక్టర్ వద్ద కార్మికులు విధులు నిర్వహిస్తుండగా రసాయనాల మధ్య ఒత్తిడి ఎక్కువై ఒక్కసారిగా మంటలు ఏర్పడ్డాయి. అక్కడ పనిచేస్తున్న కార్మికులు అప్రమత్తమై పరుగులు తీశారు. పరిశ్రమ ప్రతినిధులు హెటిరో పరిశ్రమకు సమాచారం ఇవ్వడంతో పరిశ్రమకు చెందిన ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు ఆర్పే పయత్నం చేసింది. ఈలోపు నర్సాపూర్, జీడిమెట్ల నుంచి రెండు ఫైర్ ఇంజిన్లు వచ్చి దాదాపు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి పరిశ్రలో జరిగిన ప్రమాదాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించారు. జరిగిన ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

## బడంపేటలో కార్తిక దీపాలు

దీపాలను వెలిగిస్తున్న అర్చకులు

కోహీర్, నవంబర్28: మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం కార్తిక దీపాలను వెలిగించారు. రాచన్నస్వామి ఆలయ ఆవరణలో కొలువుదీరిన నందీశ్వరుడి విగ్రహం వద్ద ప్రమిదలను ఏర్పాటు చేశారు. ఆలయంలోని శివ లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తిక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో జగదీశ్వర్‌స్వామి, చెన్నవీరయ్యస్వామి, విశ్వనాథ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మగ్గం వర్క్స్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 28: స్వయం ఉపాధి కల్పనలో భాగంగా మగ్గం వర్క్స్‌లో ఉచిత శిక్షణకు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కల్పనా శిక్షణ కేంద్రం డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు అర్హులన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో స్థానిక బైపాస్ రోడ్డులోని తమ సంస్థలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 97044 46956, 94901 29839 నంబర్లపై సంప్రదించాలన్నారు.

## అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్, నవంబర్ 28: నియోజకవర్గంలోని మొగుడంపల్లిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న బాటనీ సబ్జెక్టులో బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు పేర్కొన్నారు. ఈ సబ్జెక్టులో విద్యార్థులకు బోధించేందుకు ఎంఎస్సీ చదివిన అసక్తిగల అభ్యర్థులు డిసెంబర్ 2వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 91779 42309 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని అసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డీఎస్సీ ఉర్దూ మీడియం పోస్టులను భర్తీ చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 28: డీఎస్సీ 2024 ఉర్దూ మీడియంలో భర్తీ కాకుండా మిగిలిన ఖాళీ పోస్టులను మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని ఎస్టీయూటీఎస్ ఆధ్వర్యంలో గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ మాట్లాడుతూ డీఎస్సీ 2024లో ఉర్దూ మీడియంలో 1183 పోస్టులను ప్రకటించగా కేవలం 517 ఖాళీలను మాత్రమే భర్తీ చేశారని గుర్తు చేశారు. 666 ఖాళీలు భర్తీ కాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, సమీన్, బషీర్, ఖాజాపాషా, ఉర్దూ ట్రైనీ టీచర్స్ పాల్గొన్నారు.

## టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

మునిపల్లి, నవంబర్ 28: టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. గురువారం మునిపల్లి ఆదర్శ పాఠశాలలో సంఘం మహా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మునిపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నిరూపరాణి, జనరల్ సెక్రటరీగా మునేశ్, ఉపాధ్యాక్షుడిగా దుర్గయ్య, కోశాధికారిగా రమేశ్ ఎన్నియ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనురాధ, తదితరులు ఉన్నారు.

# 'ప్రత్యేక' పాలనలో పట్టింపేదీ?

నాగల్‌గిద్ద, నవంబర్ 28: పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. నిధుల కొరతతో పారిశుధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త సేకరించే ట్రాక్టర్లకు డీజిల్ పోయలేని పరిస్థితి పంచాయతీల్లో నెలకొన్నది. గ్రామాలకు కేటాయించబడిన ప్రత్యేకాధికారులు వారానికో సారైనా గ్రామాన్ని సందర్శించడం లేదని ఆరోపణలున్నాయి. నాగల్‌గిద్ద మండలంలో 31 గ్రామ పంచాయతీలుంగా కొత్తగా మరో రెండు తండాలు పంచాయతీలుగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లేక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి పంచాయతీలు కంపుకొడుతున్నాయి. గ్రామాల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తీయకపోవడంతో రోగాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నారు.

నాగల్‌గిద్దలో చెత్తా చెదారంతో నిండిన మురుగు కాలువ

వల్లూర్ గ్రామంలో పూడిక తీసి శుభ్రం చేయని దృశ్యం

మావినేల్లి తండా ప్రభుత్వ పాఠశాల పక్కన పరిశుభ్రంగా పరిసరాలు

ఇంద్రేశం బీసీ గురుకులలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## ఇంద్రేశం గురుకులంలో కలెక్టర్ తనిఖీ

పటాన్‌చెరు, నవంబర్ 28: ఇంద్రేశం బీసీ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం పంచాయతీ పరిధిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి వంటశాల, డైనింగ్‌రూం, స్టోర్‌రూంలను పరిశీలించారు. కూరగాయలను, వండిన ఆహారాలను కలెక్టర్ ప్రత్యక్షంగా చూశారు. మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించి, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. మరుగుదొడ్లు, కిటికీలు, డోర్లకు మరమ్మతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్‌కి ఆదేశించారు. భవన యజమానితో మాట్లాడి మౌలిక వసతులను కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని కస్తూర్బా పాఠశాలల్లో ప్రత్యేక అధికారులుగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను వాడకూడదని సూచించారు. బియ్యం నాణ్యతగా ఉండేలా చూడాలని పౌరసరఫరాల శాఖకు ఆదేశాలిచ్చామన్నారు.

**'రైతు పండుగ'కు ఏర్పాట్లు పూర్తి**

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 28: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో ఈ నెల 30 వరకు జరిగే వేడుకలకు జిల్లా నుంచి రైతులను తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ క్రాంతి తెలిపారు. జిల్లాలోని 15 మండలాల నుంచి 17 ఆర్టీసీ బస్సుల ద్వారా 850 మంది రైతులను తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు

నిందితులను అరెస్ట్‌చేసి వివరాలు వెల్లడించిన సీఐ అనిల్‌కుమార్

అందోల్, నవంబర్ 28: గ్రామాల్లో పెద్ద మనుషులుగా చలామని అవుతూ పంచాయతీలు పెడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు తప్పవని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ హెచ్చరించారు. గురువారం జోగిపేట సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అందోల్ మండలం చింతకుంట శివారులోని మంజీరా నదిలో తల్లీకొడుకుల ఆత్మహత్యలకు కారకులైన ఏడుగురు నిందితులను అరెస్టుచేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. శ్యాంకుమార్ ఆటో దొంగతనం చేశాడని ఈనెల 26న గ్రామంలో పంచాయతీపెట్టి ఆటో ఖరీదు రూ.5లక్షల వరకు ఉంటుందని జరిమానా చెల్లించాలని శ్యాంకుమార్‌ను ఏడుగురు బెదిరించినట్లు తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన శ్యాంకుమార్, అతడి తల్లి బాలమణి మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాలను నీటిలో నుంచి బయటకుతీసి బాలమణి భర్త యాదయ్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఇద్దరి మృతికి కారణమైన నిందితులు మహబూబ్‌అలీ, మౌలానా, అస్లాం, చాంద్‌పాషా, శ్రీనివాస్, శ్రీశైలం, అంజయ్యను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

## ఓపెన్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 28: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో 2024-25 సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్ణీత అపరాధ రుసుముతో డిసెంబర్ 2 నుంచి అదే నెల 12 వరకు పొడిగించినట్టు జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ప్రవేశానికి సంబంధించి ఓసీ పురుషులకు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పురుషులు, మహిళలందరికీ రూ.1,000, అందరికీ ప్రాస్పెక్టస్ ఖరీదు రూ.150, ఆన్‌లైన్ చార్జీలు అదనం, అపరాధ రుసుము కూడా అందరికీ రూ.100 ఉంటుందని వివరించారు. ఇంటర్మీడియట్ ప్రవేశానికి సంబంధించి ఓసీ పురుషులకు రూ.1,500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పురుషులు, మహిళలందరికీ రూ.1,200, అందరికీ ప్రాస్పెక్టస్ ఖరీదు రూ.300, ఆన్‌లైన్ చార్జీలు అదనం, అపరాధ రుసుము కూడా అందరికీ రూ. 200 ఉంటుందని వివరించారు. నిర్ణీత ఫీజు కంటే ఎక్కువ వసూలు చేసినచో సంబంధిత అధ్యాయన కేంద్రాన్ని రద్దు చేస్తామని హెచ్చరించారు. అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకట స్వామి(80084 03635)ని సంప్రదించాలని సూచించారు.

## ఆటోలో గర్భిణి ప్రసవం

ఝరాసంగం, నవంబర్ 28: మండల పరిధిలోని పుర్యానాయక్ తండాకు చెందిన బానోతు స్వప్నకు గురువారం ఉదయం పురిటినొప్పులు మొదలు కావడంతో కుటుంబీకులు ఆమెను ఆటోలో మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు ఆటోను ఆశ్రయించారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో సమయానికి చేరుకోలేక మార్గం మధ్యలోనే ఆటోలో ప్రసవించింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు డాక్టర్ రమ్య తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని తండా వాసులు కోరుతున్నారు.

## పూలేకు ఘన నివాళి

సదాశివపేట, నవంబర్ 28: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం, అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాల సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. కుల వ్యవస్థ, మహిళల పట్ల వివక్ష నిర్మూలనకు కృషి చేశారని తెలిపారు.

నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, తదితరులు

కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రకాశ్, నాయకులు సోమశేఖర్, సత్యంగౌడ్ పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప పడి పూజ

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

జిన్నారం, నవంబర్ 28: కొడకంచి ఆది నారాయణ స్వామి ఆలయ ఆవరణలో గురువారం అయ్యప్ప మహాపడి పూజ వైభంగా జరింగింది. బొంతపల్లి పారిశ్రామికవాడలోని స్యామ్ కర్గ్ పిస్టన్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప పడిపూజకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిన్నా రం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి హాజరయ్యారు. ఆదినారాయణ స్వామిని స్థానిక నాయకులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్య ప్ప పడిపూజలో పాల్గొన్నారు. అయ్యప్ప పడిపూజకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు, స్యామ్ పిస్టన్ పరిశ్రమ కార్మికులు, భక్తులు భారీగా హాజరయ్యారు. అ య్యప్ప నామ స్మరణ, భక్తుల శరణుఘోషతో కొడకంచి గ్రామం పులకించింది. కార్యక్రమంలో ఆదినారాయణస్వామి ఆలయ కమి టీ చైర్మన్ రామాజీరావు, మాజీ సర్పంచ్‌లు చెట్టి శివరాజ్, శ్రీశైలంయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, నాయుడు, స్థానికులు పాల్గొన్నారు. గడ్డపోతారం గ్రామంలో పెంటేశ్ గురుస్వామి అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాము లు, మహిళలు, భక్తులు భారీగా పాల్గొన్నారు. మాజీ సర్పంచ్‌లు ప్రకాశ్‌చారి, అశోక్, మాజీ ఎంపీటీసీ బాశెట్టిరాజు, పరిశ్రమల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## కార్మికులను పర్మినెంట్ చేయాలి

జహీరాబాద్, నవంబర్ 28: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి, రూ. 26 వేల వేతనాన్ని అందజేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఏరియా దవాఖానలో ఆవరణలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో పనిచేసే కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్లు వేలాది రూపాయలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, దవాఖాన కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు మహిపాల్, నాయకులు పవన్, ముస్తఫా, ఎలీషా, అఖిల్, కృష్ణ పాల్గొన్నారు.

జహీరాబాద్ దవాఖానలో సీఐటీయూ జెండాను అవిష్కరిస్తున్న భూపాల్

## జర్నలిస్టు కాలనీకి బస్సు ప్రారంభం

జిన్నారం, నవంబర్ 28: ఖాజీపల్లి పంచాయతీలోని జర్నలిస్టు, జీఎంఆర్ కాలనీలకు ఆర్‌కే ఫౌండేషన్ సహకారంతో నూతన బస్సు సర్వీసు ప్రారంభమైంది. గురువారం ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ సీనియర్ సిటిజన్లతో కలిసి బస్సును, బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లంపేట్, బాచుపల్లి, నిజాంపేట్‌మీదుగా గచ్చిబౌలి వరకు ప్రతి రోజు బస్సు సర్వీసు నడుస్తుందన్నారు. బస్సు సర్వీసుతో ప్రజలు, విద్యార్థులు, శ్రామికులకు మేలు జరుగుతుందన్నారు. బస్సును అలంకరించి డ్రైవర్, కండక్టర్లను సన్మానించారు. ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామన్నారు.

బస్సు ప్రారంభోత్సవంలో ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ రమాకాంత్, ప్రజలు

## మత్స్యకారుల అభివృద్ధికి పెద్దపీట

జిన్నారం, నవంబర్ 28: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం మండలంలోని ఊట్ల గ్రామంలో నిర్మించిన ముదిరాజ్, మత్స్య సహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తున్నదన్నారు. కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు. అంతకుముందు సత్యానారయణ స్వామి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

## ఓటరులిస్టులో పేర్ల మార్పుపై విచారణ

హత్నూర, నవంబర్ 28: హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ ఓటరు లిస్టుల్లోని పేర్లు వార్డులవారీగా జరిగిన పొరపాట్లపై డీఎల్పీవో అనిత గురువారం విచారణ చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం ఓటరు లీస్టుల సవరణ చేపట్టడంతో ఒక వార్డులోని ఓటర్లు మరో వార్డుల్లోకి వెళ్లడంతో స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఓటరు జాబితాలో పేర్లు వార్డులవారీగా మార్పు జరగడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు పాత ఓటరు లిస్టు మాదిరిగానే రూపొందించాలని స్థానికులు కోరడంతో పరిశీలించి తగు చర్యలు తీసుకోనున్నట్లు డీఎల్పీవో సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో యూసూఫ్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో విచారణ చేస్తున్న డీఎల్పీవో అనిత

# రెండు నెలల వేతనాలిస్తాం

*భగరథ నీటి సరఫరాను పునరుద్ధరించండి ■ కార్మికులతో రెవెన్యూ అధికారులు*

భగీరథ కార్మికులతో చర్చలు జరుపుతున్న మండల రెవెన్యూ అధికారులు

జహీరాబాద్, నవంబర్ 28: రెండు నెలల వేతనాలిస్తాం.. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని న్యాల్‌కల్ మండల రెవెన్యూ అధికారులు కార్మికులను కోరారు. ఎనిమిది రోజులుగా న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ పరిధిలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులు వేతనాల కోసం ఆందోళన చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై ఇటీవల జిల్లా అధికారులు ఆందోళన చేస్తున్న కార్మికులతో జరిపిన చర్యలు విఫలమైన విషయం తెలిసిందే.

**రూ.18 వేల వేతనం.. ఉద్యోగ భద్రత కల్పిస్తేనే: కార్మికులు**

డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్‌ఐ శ్యాంరావు, జూనియర్ అసిస్టెంట్ సాయన్న హద్నూర్ పోలీసులతో కలిసి రాఘవపూర్ మిషన్ భగీరథ ఫిల్లర్ బెడ్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులతో గురువారం చర్చలు జరిపారు. రెండు నెలల వేతనాలను చెల్లిస్తామని, వాటిని తీసుకొని తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కార్మికులను కోరారు. వేతనాల కోసం ఆందోళన చేసినప్పుడల్లా అధికారులు, కాంట్రాక్టర్ ఇదే మాట చెబుతూ ఒక నెల.. ఒక నెల వేతానాన్ని చెల్లిస్తూ కాలం వెళ్లాదీస్తున్నారని కార్మికులు ఆరోపించారు. తమకు రావాల్సిన ఏడు నెలల వేతనాలతో పాటు వేతనాన్ని రూ.18 వేలకు పెంచి, హెల్త్ కార్డు, ఐడీ కార్డులను మంజూరుచేసి, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలను కల్పిస్తేనే తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని కార్మికులు తేల్చిచెప్పారు. కొంతమంది కార్మికులు అందుబాటులో లేరని, వారితో చర్చించి తమ నిర్ణయం చెబుతామని కార్మికులు అధికారులకు వివరించారు. శుక్రవారం సంబంధిత జిల్లా అధికారులు వస్తారని, కార్మికులందరూ సమయానికి అందుబాటులో ఉండాలని మండల రెవెన్యూ అధికారులు కార్మికులను కోరారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

హత్నూర, నవంబర్ 28: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న సూచించారు. గురువారం మండల కేంద్రమైన హత్నూర కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనంతోపాటు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వడంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట గదులను శుభ్రంగా ఉంచుతూ తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ పాల్గొన్నారు.

**నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు**

ఝరాసంగం, నవంబర్ 28: ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని, నాణ్యత లోపిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తిరుమలరావు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లో విద్యుత్, మంచి నీటి సమస్య ఉన్నదని విద్యార్థులు, ప్రిన్సిపాల్ తహసీల్దార్ దృష్టికి తీసుకురావడంతో త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

హత్నూర: కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న

## అభివృద్ధి పనులు పరిశీలించిన ట్రైనీలు

సదాశివపేట, నవంబర్ 28: హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో ట్రైనింగ్ చేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్, ఎఫ్‌ఎస్‌లు 11 మంది అధికారులు గురువారం మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. ముందుగా పట్టణ అభివృద్ధిపై మున్సిపల్ సమావేశ మందిరంలో వివిధ సెక్షన్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఊబ చెరువుపై అభివృద్ధి పనులను పరిశీలించి వికారాబాద్ రోడ్డులోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్, పంప్‌రూమ్‌ను సందర్శించారు. పట్టణానికి మంచి నీటిని ఏవిధంగా సరఫరా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సిద్దాపూర్‌లోని ప్రభుత్వ దవాఖానను సందర్శించి డాక్టర్ల పనితీరును తెలుసుకొని తగు సూచనలు చేశారు. అనంతరం రవీంద్రమోడల్ హైస్కూల్‌లో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్, మున్సిపల్ కమిషనర్ ఉమ, టీపీవో భాస్కర్, మేనేజర్ ఉమేందర్‌సింగ్, ఏఈ రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పంప్‌రూమ్‌ను పరిశీలించిన ట్రైనీ అధికారులు

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు భెల్ విద్యార్థులు

భెల్ నుంచి హుజూరాబాద్‌కి వెళ్తున్న హాకీ క్రీడాకారులు

రామచంద్రాపురం, నవంబర్ 28: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు భెల్ భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. హుజూరాబాద్‌లో 29 నుంచి డిసెంబర్ 1వ వరకు జరిగే హాకీ పోటీల్లో పాల్గొననున్నారు. అక్టోబర్‌లో కందిలోని డీఏవీ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో భవన్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో సాయి, నిశాంత్, దేవహర్షిని, అక్షయ ఆడనున్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో జరిగే పోటీలకు విద్యార్థులు గురువారం బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తమ విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, హెడ్ మిస్సెస్ భానునిర్మల, పీఈటీలు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సెయింట్ ఆంథోనీస్ విద్యార్థులకు ట్రోఫీ

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 28: యంగ్ స్టార్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో స్థానిక విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థులు ట్రోఫీని కైవసం చేసుకున్నారు. జయసాగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్ క్రికెట్ అకాడమీ పటాన్‌చెరువులో నిర్వహించిన లీగ్ టోర్నమెంట్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ టోర్నీలో 219 పరుగులు, 14 వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ సిద్దార్థ్ రెడ్డి, 268 పరుగులతో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా సాయిచరణ్ నిలిచారు. జయసాగర్ ఫౌండర్ సరస్వతీ సింగ్ చేతుల మీదుగా విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. టోర్నీ విజేతగా నిలిచిన సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థులను ఆ పాఠశాల చైర్మన్ ఈథర ఆంథోనీరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల, కోచ్ కరుణాకర్ అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఆంథోనీరెడ్డి